క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప పడిపూజ



మద్దూరు: మండల కేంద్రంలో కుమ్మరి మల్లేష్ స్వగృహంలో అయ్యప్ప పడిపూజను గురుస్వాములు మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణు, వెంకట్ రాములుగౌడ్‌ల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మొదటగా గణపతికి అష్టోత్తరఅంగపూజ, అభిషేకం అనంతరం కుమారస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామి విగ్రహానికి పంచామృతాభిషేకం, నిర్వహించి పడి వెలిగించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులు భజనలు చేశారు. పూజలో మద్దూరు, దామరగిద్ద, కోస్గి, కడంపల్లి, తదితర గ్రామాలకు చెందిన స్వాములు వచ్చారు. పూజల అనంతరం స్వాములకు అన్నదానం చేశారు.

నేడు కుంకుమార్చన

నర్వ: మండల కేంద్రంలోని శివాలయంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా గురువారం కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టీటీడీ, హిందు ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో చేపట్టే ఈ కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ప్రతి రోజు నిర్వహించే ఆధ్యాత్మిక ప్రవచనాలలో ప్రతి ఒక్కరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

నాణ్యతతో నిర్మించాలి



ధన్వాడ: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్నా బస్‌స్టాండ్‌ను నాణ్యతతో నిర్మించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరహరి అన్నారు. బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. నాణ్యతతో నిర్మాణం చేపట్టాలని ప్రస్తుతం పనులు చురుకుగా సాగుతున్నాయి. వచ్చే నెలలోపు పనులు పూర్తిచేసి అందరికి అందుబాటులో తేవాలని ఇందుకు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి పూర్తిస్థాయిలో మద్దతు అందజేస్తారని వారు తెలిపారు. నరేందర్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, రఘువేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, బాలకృష్ణ తదితరుల ఉన్నారు.

ప్రమాదకరంగా గుంత

మాగనూర్: మండల కేంద్రంలోని వర్కూర్ రోడ్డులో మిషన్‌భగీరథ పైపులైన్‌కు సంబంధించిన మ్యాన్‌హోల్ మూతలేని ప్రమాదకర గుంత దర్శనమిస్తుంది. ఈ మార్గంలో నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు తిరుగుతూ ఉండటంతోపాటు అతి సమీపంలోనే కళాశాల విద్యార్థులు ఇటుగా వెళ్తుంటారు. రోడ్డుకు అతి సమీపంలో ఈ గుంత ఉండటంతో ప్రమాద బారిన పడే అవకాశాలు ఉన్నాయి. అసంపూర్తి పనులతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి గుంతపై మూత ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యేలకు సన్మానం



మక్తల్: అసెంబ్లీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావులను టీకేఆర్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, నర్వ మాజీ పీఏసీఎస్ చైర్మన్ బంగ్లాలక్ష్మారెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని క్యాంప్‌లో ఉన్న ఎమ్మెల్యేలను వారు అక్కడికి వెళ్లి శాలువాతో సన్మానం చేశారు.

ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభం

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌లో యునైటెడ్ వే అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా కుట్టుమిషన్ శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ విజయలక్ష్మి, సత్యారెడ్డి, మండల బీజేపీ నాయకుడు వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొని శిక్షణను ప్రారంభించారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





మక్తల్‌లో..



మరికల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అంబేడ్కర్‌కు ఘన నివాళి

నారాయణపేట రూరల్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం మండల వ్యాప్తంగా విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. జాజాపూర్ జెడ్పీస్కూల్, లక్ష్మీపూర్ పీఎస్, తిర్మలాపూర్ యూపీఎస్, పట్టణంలోని శ్రీ హంసవాహిని, రవితేజ, శ్రీసాయి, కృష్ణగోకులం స్కూల్‌లలో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు.. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు మాట్లాడుతూ వెనకబడిన ప్రజల అభ్యున్నతికి ఎంతో కృషిచేశారని ఆయన సేవలు కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



నారాయణపేటలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మక్తల్: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ మేరకు.. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, హన్మంతు, మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహాగౌడ్, శంకరమ్మ, చిన్నహన్మంతు, రాంలింగం, రవికుమార్, నారాయణ, వాకిటి ఆంజనేయులుల, దత్తత్రేయ, నర్సప్ప, శ్రీనివాసులు, సూర్యప్రకాష్, లక్ష్మయ్య, వెంకటయ్య, వాకిటి అంజనేయులు పాల్గొన్నారు.

నర్వ: మండలంలోని బుధవారం ఆయా గ్రామాల్లో నాయకులు అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నెల్లూరి పావని, ఎంపీటీసీ నీరజ్, బాల్‌దాస్ పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని మండల కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు. అలాగే మండల కేంద్రంలోని అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్ సంఘం నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్, మధుసూదన్, అర్జున్, శంకర్, శివ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం అంబేడ్కర్ విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, నిడుగుర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌లు సూర్యప్రకాశ్‌రెడ్డి, కతలప్ప, అరవింద్‌కుమార్, ఎల్కోటి నారాయణరెడ్డి, మణెమ్మ, మోహన్‌రెడ్డి, అహ్మద్, లక్ష్మారెడ్డి, నాసీర్‌ఖాన్ పాల్గొన్నారు.

కృష్ణా: ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హిందూపూర్ అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు అన్నారు. బుధవారం మండలంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుభాష్, అనిల్‌కుమార్, అంజప్ప, నర్సప్ప, వికాస్, అక్బర్, మారెప్ప, మహేంద్ర, శంకరప్ప పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి ప్రజాప్రతినిధులు పూలమాలవేసి నివాళులర్పించారు. వీరన్న, హరీష్, కృష్ణయ్య, సత్యన్న, మొగులప్ప, ఆంజనేయులు, రాములు, మల్లయ్య, బాల్‌రెడ్డి, సూర్యప్రకాష్, రాజు, రవి పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని నిడ్జింత ఉన్నత పాఠశాల ఆ వరణలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఉపాధ్యాయులు రఘు,లాజర్ పాల్గొన్నారు.

ధన్వాడ: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరహరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలకృష్ణ, శివకుమార్, నరేందర్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, లక్ష్మయ్య, రాఘవేందర్‌రెడ్డి, రాజేష్, రాంచంద్రయ్య పాల్గొన్నారు.



కృష్ణాలో..



మద్దూర్‌లో..



ధన్వాడలో..



ఊట్కూరులో..



నర్వలో వర్ధంతిలో పాల్గొన్న నాయకులు



మాగనూర్‌లో..

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



ఎండీ. ఖాజా మొయినుద్దీన్

మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్ల పట్టణంలో ఈనెల 8 నుంచి ప్రారంభంకానున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 ఫుట్‌బాల్ టోర్నీకి జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ పాఠశాల విద్యార్థి ఎండీ.ఖాజా మొయినుద్దీన్ ఎంపికయ్యాడు. ఈ మేరకు విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ జలజం అరుంధతిరాయ్, ప్రిన్సిపాల్ రవీందర్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటాలని కోరారు. కార్యక్రమంలో పీఈటీలు వినోద్‌కుమార్, అరుణ్, వెంకట్, నాసర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: బాబ్రీ మజీద్ కూల్చివేతలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆల్ పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అధికారికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కన్వీనర్ మోసీన్‌ఖాన్, నాయకులు అబ్దుల్ హాదీతదితరులు ఉన్నారు.

రేచింతలకు బస్సు బంద్

ఆత్మకూర్: వనపర్తి ఆర్టీసీ డిపోకు చెందిన రేచింతల బస్సు అర్ధాంతరంగా రద్దు చేయడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. బుధవారం సాయంత్రం 4గంటలకు రావాల్సిన బస్సు రాత్రి 8 గంటలు దాటినా రాకపోవడంతో చంటిపిల్లలతో మహిళలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. బస్సు ఎందుకు రాలేదని అడుగుదామంటే ఆర్టీసీ అధికారులు ఎవరూ లేకపోవడంతో ప్రయాణికులు దిక్కుతోచని స్థితిలో బస్టాండ్‌లోనే పడిగాపులు కాశారు. తిప్పడంపల్లి, ఆరేపల్లి, కత్తేపల్లి, తూంపల్లి, వీరరాఘవపూర్, రేచింతలకు చెందిన 50 మందికిపైగా ప్రయాణికులు ఆర్టీసీ అధికారుల నిర్వాకంపై మండిపడ్డారు. కొంతమంది వనపర్తి ఆర్టీసీ అధికారులతో ఫోన్ ద్వారా విషయం తెలపడంతో బస్సు రావడం లేదని చావు కబురు చల్లగా చెప్పడంతో ఉదయం వచ్చిన బస్సు సాయంత్రం ఎందుకు రాదని ప్రశ్నించారు. రేచింతల బస్సు ప్రతినిత్యం తిరిగే విధంగా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.



బస్సుకోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

పొంచి ఉన్న ప్రమాదం



చిన్నచింతకుంట: అమ్మపురం, కురుమూర్తి ఆలయ మధ్యలో దేవరకద్ర, ఆత్మకూర్ రహదారికి పక్కన విద్యుత్ స్తంభం పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. సంభం ఎప్పుడు కూలి పడుతుందో తెలి యని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు, జాతరకు వెళ్లే భక్తులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

- నిబంధనలకు విరుద్ధంగా బట్టీల నిర్వహణ
- మామూళ్ల మత్తులో అధికారులు
- ఇతర రాష్ట్రాల కూలీలచే వెట్టిచాకిరీ

యథేచ్ఛగా ఇటుక బట్టీల నిర్వహణ

కృష్ణా: మండలంలోని ఇటుకల బట్టీలకు రెవెన్యూ, మైనింగ్, లేబర్ శాఖలనుంచి ఎలాంటి అనుమతులు లేవని రెవెన్యూ అధికారులు తెలియజేస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన కొందరు కాంట్రాక్టర్లు రోడ్డు పక్కన పొలాలు ఉన్నరైతుల నుంచి లీజుకు తీసుకొని వాటిలో ఇటుకల బట్టీలను నిర్వహిస్తున్నారు. మహారాష్ట్ర, ఒరిస్సా, పశ్చిబెంగాల్, బీహార్ రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది వలసకూలీలను తీసుకొచ్చి రాత్రి పగలు తేడా లేకుండా ఇటుక బట్టీల్లో వెట్టి చాకిరి చేయిస్తున్నారు. కాగా తల్లిదండ్రులతో పాటు వారి పిల్లలు కూడా వారి తల్లిదండ్రులు చేస్తున్నా పనుల్లో వారికి ఆసరగా నిలుస్తున్నారు. పైగా జిల్లా లేబర్ కార్యాలయంలో మాత్రం ఇటుకల బట్టీల్లో ఆర్‌బీసీ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు రికార్డుల్లో ఉంటున్నాయి. అలాగే ఇటుకల బట్టీలకు గ్రామాల్లోని ప్రభుత్వ నోటిఫైడ్ చెరువుల్లోని ఒంద్రుమట్టిని ఏలాంటి అనుమతులు లేకుండగా తరలిస్తున్నా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.



బట్టీలో పనులు చేస్తున్న చిన్నారులు (ఫైల్)

అధికారుల అండదండలు..

ఇక్కడ స్థానికంగా ఉన్న కొందరిని పక్కన పెట్టుకొని నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వారికి అధికారుల అండదండలు తొడవడంతో వారు ఏం చేసిన అడిగేవాడు లేకుండగా పోయింది. గత మార్చి 20న మండలంలోని ఓ బట్టీల్లో పనిచేస్తున్న ఒరిస్సాకు చెందిన వలస కూలీలను ఆ బట్టీ యజమాని ప్రతినిత్యం వేధింపులకు గురి చేయడంతో వారు ఉన్నతాధికారులకు అప్పట్లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుకు స్పందించిన అడిషనల్ డీజీపీ సీఐడీ మహేష్‌భగవత్ తక్షణమే బట్టీని సందర్శించి విచారణచేసి తగుచర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశించడంతో వారి ఆదేశాలమేరకు డీఎస్పీ శంకర్‌నాయక్, కృష్ణా ఎస్ఐ విజయభాస్కర్ ఆ ఇటుక బట్టీకి చేరుకొని విచారణ చేసి వలసకూలీలను వారి సొంత గ్రామాలకు ప్రత్యేక వాహనాల్లో పంపించారు. ఇలా ప్రతి నీత్యం ఈ మండలంలోని వలస కూలీలపై వేదింపులు జరుగుతున్నా జిల్లా లేబర్‌శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

బట్టీల్లో పనులు నిలిపివేశాం..



మండలంలోని ఇటుకల బట్టీలకు రెవెన్యూ శాఖనుంచి ఎలాంటి అనుమతులు లేవు. మహారాష్ట్రకు చెందిన కొందరు వ్యక్తులు వ్యవసాయ పొలాల్లోని బట్టీలు నిర్వహిస్తున్నారు. ఆ పొలాలకు నాల అనుమతులు ఉంటేనే బట్టీలు నిర్వహించాలి. అందుకు గాను తమశాఖకు చెందిన ఒకరిని నియమించాం. ఇటుకల బట్టీలో పనులు జరగకుండగా పర్యవేక్షిస్తున్నాం.

–దయాకర్‌రెడ్డి, తహసీల్దార్, కృష్ణా మండలం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మాగనూర్: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఏఎస్ఐ మన్నన్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లిలోని బస్టాండ్ చౌరస్తాలో డయాల్–100 సిబ్బంది ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వారికి సెల్ ఫోన్ ఇవ్వడం చేయరాదన్నారు. అనవసరమైన లింకులు మొబైల్‌కు వస్తే ఓపెన్ చేయరాదని, లాటరీ తగిలిందని, తక్కువ ధరలకు ఆన్‌లైన్‌లో వస్తువులు అమ్ముతున్నట్లు ప్రకటనలు చూసి మోసపోవద్దన్నారు. ఎవరైనా అలాంటి వారి బారిన పడితే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1093కి కాల్‌చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ ఉమేష్‌గౌడ్, కానిస్టేబుల్స్ రాజశేఖర్, సాయి, హోంగార్డు రెహ్మత్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగహన కల్పిస్తున్న ఏఎస్ఐ మన్నన్

ఆలయ ముఖద్వారం ప్రారంభం



తీలేర్ స్టేజీ వద్ద దేవాత మూర్తుల ముఖద్వారం ప్రారంభిస్తున్న నాయకులు

మరికల్: మండలంలోని తీలేర్‌లో వెలసిన శ్రీరేణుక ఎల్లమ్మ, శివాలయాలకు సంబంధించిన ముఖద్వారం బుధవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ సర్పంచ్‌లు వెంకారెడ్డి, వజ్రమ్మ, మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి జ్ఞాపకర్థంగా రూ. 10 లక్షల నిధులతో తీలేర్‌స్టేజీ వద్ద దేవాతమూర్తుల ముఖద్వారం నిర్మించినట్లు తెలిపారు. అంతకుముందు ముఖద్వారానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వజ్రమ్మ, తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, రాంచంద్రయ్య, కుర్మయ్య, బాల్‌రాజ్, రవి పాల్గొన్నారు.

బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి

మాగనూర్: మండలంలోని నేరడగండొడ్డి గ్రామ రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. దశాబ్దాల కాలంగా ఉన్న మట్టిరోడ్లను బీటీలుగా మార్చకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో వివిధ పనుల నిమిత్తం ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. సరైనా రోడ్డు సౌకర్యం లేక కనీసం ఆటోలు కూడా రావడం లేదని వాపోతున్నారు. గతంలో కొంత మేర బీటీ వేసి వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీరోడ్డు సౌకర్యం కల్పించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.



మట్టిరోడ్డుగా ఉన్న నేరడగండొడ్డి రోడ్డు

బాస్కెట్‌బాల్ పోటీలకు అపెక్స్ పాఠశాల విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: రంగారెడ్డి జిల్లా కొంపల్లిలో నేటి నుంచి జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని అపెక్స్ పాఠశాల విద్యార్థులు పారిజాత, సిరి, యశ్వంత్, వరుణ్ కుమార్‌గౌడ్ ఎంపికయ్యారు. వీరిని బుధవారం పాఠశాలలో డైరెక్టర్ రామారావు, ఏఏఓ నాగమణి, ప్రధానోపాధ్యాయులు చైతన్యరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు ఉస్మాన్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ తదితరులు

బస్టాండ్‌ను పట్టించుకోరా?



నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్



బస్టాండ్ ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి

అమరచింత: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆదరణ లేక శిథిలావస్థకు చేరువలో ఉన్న సంబంధిత ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణ ప్రాంగణమంతా నిర్మానుష్యంగా తయారవుతుంది. బస్టాండ్‌ను ప్రారంభించి 24ఏళ్లు గడుస్తున్న బస్సులు మాత్రం ఆగడం లేదు. ఆర్టీసీ అధికారులకు ఎన్ని పర్యాయాలు ఫిర్యాదు చేసిన బస్టాండ్ రుపురేఖలు మాత్రం మారడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లడానికి బస్టాండ్‌కు వెళ్లకుండా చౌరస్తాలో నిల్చొని బస్సుల కోసం ఎదురు చూసున్న పరిస్థితులు దాపరించాయి. బస్సులు బస్టాండ్‌లోనే నిలవాలని పట్టుబట్టడంతో గద్వాల డిపో బస్సులు మాత్రం బస్టాండ్‌లో ఇప్పటికి ఆగుతున్నాయే తప్ప ఇతర డిపోలకు చెందిన బస్సులు ఆగడం లేదని ప్రయాణికులు తెలుపుతున్నారు.

వస్తువులన్నీ చోరీ

బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కుర్చీలు, బెంచీలు, ఫ్యాన్లు, విద్యుత్ బల్బులు చోరీకి గురవ్వడంతో ఆర్టీసీ అధికారులు మరోమారు వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయలేకపోయారు. మరుగుదొడ్లు సైతం మరమ్మతు చేయకపోవడంతో మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

యువకుల శ్రమదానంతో..

శిథిలావస్థలో ఉన్న బస్టాండ్‌ను స్థానిక యువకులు కలిసికట్టుగా శ్రమదానంతో శుభ్రం చేశారు. విరాళాలు పోగుచేసి పెయింటింగ్, లైటింగ్ పనులను చేయించారు. దీంతో బస్టాండ్ రూపురేఖలు మారిపోయిన అధికారుల్లో మాత్రం మార్పురావడం లేదు.

పట్టించుకోని మున్సిపల్

మున్సిపాలిటీ కేంద్రంలో బస్టాండ్ ప్రాంగణం ఉన్నా వినియోగంలోకి తీసుకొద్దామన్న ఆలోచన మున్సిపల్ అధికారులకు, పాలక మండలి సభ్యులకు కలగడం లేదు. మహిళలు మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవని ఇబ్బందులు పడుతున్నా నిరుపయోగంలో ఉన్న మరుగుదొడ్డిని మరమ్మతు చేయలేక పోతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.